క్లుప్తంగా

అయోధ్యపురం రైల్వే గేట్ మూసివేత

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ సమీపంలోని డీజిల్ లోకోషెడ్ పక్కన ఉన్న అయోధ్యపురం రైల్వే గేట్ నంబర్ 58ని నాలుగు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం తెలిపారు. మేజర్ రైల్వే ట్రాక్, రోడ్డు మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 6నుంచి 10వ తేదీ వరకు మూసి వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రజలు ఇతర మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలని కోరారు.

నేడు ఓసిటీలో జరగనున్న ఎమ్మార్పీఎస్ సభ వాయిదా

కాశిబుగ్గ: ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ ఓసిటీ మైదానంలో శుక్రవారం జరగనున్న ఆవిర్భావ మహాసభ అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని ఎమ్మెస్పీ తూర్పు కోఆర్డినేటర్ ఈర్ల కుమార్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

బ్యాడ్మింటన్ నేషనల్ పోటీలకు భువనేశ్వర్ ఎంపిక



వరంగల్ అర్బన్: ఒడిశాలో జరగనున్న నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలకు భువనేశ్వర్ ఎంపికయ్యారు. వరంగల్ బల్దియా ఇండోర్ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న భువనేశ్వర్.. పలుమార్లు రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై కోచ్ శ్రీధర్, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

80 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి



మాట్లాడుతున్న సురేందర్ మాదిగ

కాజీపేట: రైల్వే వ్యాగన్ పరిశ్రమ ఏర్పాటు చేయడంతో పాటు స్థానిక నిరుద్యోగ యువతకు 80 శాతం ఉద్యోగ అవకాశాలను కల్పించాలని అఖిలపక్ష కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కాజీపేట పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ బండారి సురేందర్ మాదిగ మాట్లాడుతూ ఈ విషయమై వరంగల్ సభలో పీఎం నరేంద్రమోదీ ప్రకటించేలా బీజేపీ రాష్ట్ర నాయకత్వం చూడాలని సురేందర్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గడ్డం అశోక్, బొల్లికొండ కోటి, పిల్లి క్రిష్టఫర్, కుమ్మరి శ్రీనివాస్, రేణుకుంట్ల ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గుండెవాపు నివారణ టీకాలు



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం పెగడపల్లిలో గురువారం పశువులకు గుండెవాపు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ మహ్మద్ అజీమ్ మాట్లాడుతూ పశువులకు ప్రతీ ఆరు నెలలకొకసారి గుండెవాపు నివారణ టీకాలు వేయించాలని సూచించారు. దాంతో గుండె సంబంధిత వ్యాధులతో పాటు కాలేయ వ్యాధులు దరికి చేరవని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది సయ్యద్ ఇఫ్తెకార్ అలీ, రైతులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించాలి

హసన్‌పర్తి: 66వ డివిజన్ పరిధిలోని బుడిగ జంగాలకు డబుల్ బెడ్రూం ఇళ్లతో పాటు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని బహుజన సమాజ్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు చాతళ్ల వేణుగోపాల్ డిమాండ్ చేశారు. బుడిగజంగాల కాలనీలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సమాజ్‌వాది పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఓంకార్‌యాదవ్, నాయకులు మోటం అనిల్, ఎర్రగట్టు, నాగరాజు, రాజ్ కుమార్, మోటం మహేష్, సారయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



కాజీపేట: కాజీపేట చౌరస్తాలో పీఎం నరేంద్ర మోదీ చిత్రపటానికి కార్యకర్తలు, నాయకులతో కలిసి బీజేపీ ఎన్నికల ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్ గురువారం సాయంత్రం పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి, చిర్ర నర్సింగ్‌గౌడ్, గుంటి కుమారస్వామి, చాంద్‌పాషా, సుంచు వేణుకుమార్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రాం

అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన సంఘ సంస్కర్త, దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతిని నగర వ్యాప్తంగా గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



డీసీసీ భవన్‌లో బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



హనుమకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ - టీఎస్ నాయకులు



దేశాయిపేటలో బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సురేష్‌జోషి, స్థానికులు



కేయూలోని జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెస్పీ జాతీయ నేత మంద కుమార్‌మాదిగ, తదితరులు



కాజీపేట బాపూజీనగర్‌లో బాబూ జగ్జీవన్‌రాంకు నివాళి అర్పిస్తున్న నాయకులు

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి



న్యూశాయంపేట: మాట్లాడుతున్న చక్రపాణి



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రమేష్, తదితరులు

న్యూశాయంపేట: విభజన చట్టం హామీ మేరకు కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని హనుమకొండ సీపీఎం జిల్లా కన్వీనర్ చక్రపాణి డిమాండ్ చేశారు. హనుమకొండ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చి పదేళ్లు కావస్తున్నా కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వకుండా కేంద్రం వ్యాగన్ పిరియాడిక్ ఓవరాలింగ్ వర్క్‌షాప్‌నకు శంకుస్థాపన చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో లబ్ధికోసమే శంకుస్థాపన చేస్తున్నట్లు విమర్శించారు. కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ, రైల్వే డివిజన్ స్థాపించే వరకు కార్మికులు, ప్రజలు పార్టీలకతీతంగా పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఎం.చుక్కయ్య, టి.ఉప్పలయ్య, సంపత్, దీప పాల్గొన్నారు.

కాజీపేట రూరల్: రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో రైల్వే కోచ్‌ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ కోరారు. ఈమేరకు రైల్వే జీఎం ఏకే.జైన్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని మోదీ పర్యటనను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు. వ్యాగన్ పరిశ్రమ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఉద్యోగాలలో ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, పాక్స్ చైర్మన్ వనంరెడ్డి, రైతు బంధు కోఆర్డినేటర్ సంపత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పాత పింఛన్‌ను పునరుద్ధరించాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నూతన పింఛన్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్‌ను పునరుద్ధరించాలని టీపీటీఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్‌కుమార్ గౌడ్ డిమాండ్‌చేశారు. ఈనెల 23న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్లను ఖిలా వరంగల్ ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న టీపీటీఎఫ్ రాష్ట్ర సదస్సుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమమంలో బెల్లంకొండ పూర్ణచందర్, శైలేంద్రకుమార్, రమాదేవి, సీపీఎస్ ఉపాధ్యాయులు నాగరాజు, కళ్యాణ్, రఘుపతి, సతీష్, ఇందిర, సరోజిని పాల్గొన్నారు.

వినాయక కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 43వ డివిజన్ వినాయక కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను కార్పొరేటర్ ఈదురు అరుణవిక్టర్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కాలనీ అధ్యక్షుడు వరుణ్, చెన్నకేశవులు, శివ, సిద్ధు, లైన్‌మెన్ రఘు పాల్గొన్నారు.

బీసీలకు సీట్లు కేటాయించాలి

నయీంనగర్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో గతంలో మాదిరిగా బీసీలకు కాంగ్రెస్ పార్టీ నాలుగైదు సీట్లు కేటాయించాలని ఓబీసీ నాయకుడు ఉల్లెంగుల యాదగిరి డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు ఎక్కువ సీట్లు కేటాయించాలని ఢిల్లీ వెళ్లి వినతిపత్రం ఇస్తామని తెలిపారు.

బెదిరిస్తున్నారు..

కాశిబుగ్గ: కాశిబుగ్గకు చెందిన రామా యాదగిరి, దూపం సంపత్‌లు తనను ఇబ్బందులకు గురిచేస్తూ బెదిరిస్తున్నారని కాశిబుగ్గకు చెందిన దివ్యాంగుడు సయ్యద్ ఆసద్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఫిబ్రవరిలో తన నివాస స్థలాన్ని కాశిబుగ్గకు చెందిన రామా యాదగిరి కబ్జా చేశారని, న్యాయం చేయాని వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేయగా, యాదగిరిని పోలీసులు జైలుకు పంపించారని ఆసద్ వాట్సప్‌లో తెలిపాడు. జైలు నుంచి వచ్చిన యాదగిరి.. సంపత్‌తో కలిసి రెండు రోజుల క్రితం స్కూల్ ఆటో నడుపుతున్న తనను ఆపి బెదిరింపులకు గురిచేశారని వాపోయారు.

పండ్ల పంపిణీ

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్‌లోని హౌస్ ఆఫ్ జాయ్‌లో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ గురువారం పండ్లు పంపిణీ చేశారు. 47వ డివిజన్ కార్పొరేటర్ సంకు నర్సింగరావు ఆధ్వర్యంలో దాస్యం ప్రణయ్‌భాస్కర్ జయంతి, వర్ధంతిని పురస్కరించుకొని మానసిక దివ్యాంగులకు పండ్లు, ఇతర సామగ్రిని చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ అందజేశారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



పోటీలను ప్రారంభిస్తున్న వెంకయ్య

కేయూ క్యాంపస్: క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసికోల్లాసానికి దోహదపడుతాయని కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య అన్నారు. కేయూలో బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో కేయూలో డాక్టర్ ఆర్ఎస్‌పీ సీజన్ వన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన గురువారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. అనంతరం టాస్‌వేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యాయామ విద్యా కళాశాల పార్ట్‌టైం లెక్చరర్ల ఆల్ యూనివర్సిటీ రాష్ట్ర అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్, బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, ఇన్‌చార్జ్ తేళ్లూరి సురేష్, సంతోష్‌రాథోడ్, చంద్రగిరి శ్రీకాంత్, తిరుపతి, అశోక్ రాజు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న కౌన్సిలర్ సుధ

వరంగల్ అర్బన్: మహిళలు, బాలికల సమస్యలు, హక్కులు, బాలబాలికల చట్టాల రక్షణ చట్టాలు, ఫోక్స్ యాక్ట్, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖి కేంద్రం కౌన్సిలర్ సుధ అన్నారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని మెప్మా కార్యాలయంలో ఎస్ఎల్ఎఫ్ కస్టర్లకు మహిళా చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖి కేంద్రంలో బాధిత మహిళలు, బాలికలకు అందిస్తున్న సేవలను వివరించారు. బాధిత మహిళ రక్షణ, భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎంసీ రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్ రాజ్‌కుమార్, నిర్మలాదేవి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

కమలాపూర్: మహిళలు అహార పదార్థాల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్‌లో నైపుణ్యం పెంపొదించుకొని కుటీర పరిశ్రమలు ఏర్పచుకొని ఆర్థికంగా ఎదగాలని నాబార్డ్ జిల్లా మేనేజర్ చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో నాబార్డ్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళల జీవనోపాధి, వ్యాపార సంస్థల అభివృద్ధిపై గురువారం మహిళలకు ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. మార్కెట్‌లో టమాట, సాస్, చిల్లీ సాస్, చిరు ధాన్యాలు, బిస్కెట్, మాంసం, పచ్చళ్లకు మంచి గిరాకీ ఉందని అన్నారు. మహిళలు ఈ శిక్షణలో భాగంగా మార్కెటింగ్ మెళకువలు, ఫుడ్ ప్రాసెసింగ్ లైసెన్సు, బ్రాండింగ్, ప్యాకేజింగ్ అంశాలను నేర్చుకోవాలని తెలిపారు. సర్వోదయ సిబ్బంది కవిరాజ్, అక్తర్, షరీఫ్, సంఘాల మహిళలు పాల్గొన్నారు.

బైపాస్‌రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం

● డివైడర్ తొలగించి యూటర్న్‌లు



బైపాస్ రోడ్డుపై తొలగించిన డివైడర్

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం ఖమ్మం బైపాస్‌రోడ్డు భట్టుపల్లి వద్ద డివైడర్‌ను తొలగించారు. దాంతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాజీపేట జాతీయ రహదారిని ఆనుకుని, కడిపికొండ ఆర్వోబీ బ్రిడ్జికి అనుసంధానంగా ఉన్న ఖమ్మం బైపాస్ రోడ్డుపై నిత్యం వరంగల్, ఖమ్మంకు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భట్టుపల్లి నుంచి న్యూశాయంపేటకు వెళ్లే రహదారికి ఎదురుగా ఉన్న కల్వర్టు వద్ద డివైడర్‌ను తొలగించారు. కడిపికొండ నుంచి ఉర్సు గుట్ట, ఉర్సు గుట్ట నుంచి కడిపికొండ వెళ్లే వాహనదారులు ఆకస్మాత్తులు ఈ ప్రాంతంలో యూ టర్న్ తీసుకుంటున్నారు. భారీ వాహనాలు వెళ్లే బైపాస్ రోడ్డు కావడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి తొలగించిన డివైడర్ స్థానంలో నిర్మించాలని కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న రాఘవరెడ్డి

కాజీపేట: ఇటీవల కురిసిన భారీ వర్షానికి ఇల్లు కూలిపోయి నిరాశ్రయులుగా మారిన కుటుంబానికి డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. కాజీపేట పట్టణం 63వ డివిజన్ బాపూజీనగర్ కాలనీకి చెందిన జన్ను షామిలి ఇల్లు గురువారం తెలవారుజామున కూలిపోయింది. కడు పేదరికంతో బాధపడుతున్న షామిలి కుటుంబాన్ని రాఘవరెడ్డి పరామర్శించి చేయూతనందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయశ్రీ, టీపీసీసీ కార్యదర్శి సయ్యద్ రజాలీ, కాంగ్రెస్ డివిజన్ బాధ్యుడు సందెల విజయ్ కుమార్, కె.నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈటల రాజేందర్‌కు ఘనస్వాగతం

బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమితులైన తర్వాత హుజూరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మొదటిసారి నగరానికి గురువారం వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానించారు.

– సాక్షి నెట్‌వర్క్



మడికొండ చౌరస్తాలో రాజేందర్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు



హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేటలో..



వరంగల్ ఓ సిటీలో..

మోదీ సభను విజయవంతం చేయాలి



వరంగల్: శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న నాయకులు



హసన్‌పర్తి: మాట్లాడుతున్న వాసుదేవ్

వరంగల్: వరంగల్‌లో నిర్వహించనున్న విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని బీజేపీ వరంగల్ తూర్పు నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ పిలుపునిచ్చారు. వరంగల్ ఎల్‌బీనగర్‌లోని తూర్పు బీజేపీ కార్యాలయంలో వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు విజయ సంకల్ప సభ ప్రచార రథాలను జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ జెండా ఊపి గురువారం ప్రారంభించారు. అనంతరం జనసంఘ్ వ్యవస్థాపకుడు, మార్గదర్శకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన ఫొటోకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, నాయకులు వంగల సమ్మిరెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, కనుకుంట్ల రంజిత్, కాసు శిల్ప, జగదీశ్వర్, మార్టిన్ లూథర్, వెంకన్న పాల్గొన్నారు.

నయీంనగర్: ప్రధాని నరేంద్రమోదీ సభకు ప్రజలు హాజరు కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దుబాసి వాసుదేవ్ కోరారు. ఈమేరకు ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా మీదుగా 6జాతీయ రహదారుల కోసం వేలకోట్ల రూపాయల నిధులు మంజూరు చేసిన చేసిన ఘనత మోదీదేనని వివరించారు. సమావేశంలో హనుమకొండ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నాంపల్లి శ్రీనివాస్, విక్రమ్ పాల్గొన్నారు.

కాశిబుగ్గ: హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో శనివారం జరగనున్న ప్రధాని మోదీ విజయ సంకల్పసభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్ పిలుపునిచ్చారు. 13, 19, 20, 21వ డివిజన్లలో బీజేపీ నాయకులు గురువారం ఇల్లుల్లు తిరుగుతూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనుకుంట్ల రంజిత్, కాసు శిల్ప, బాకం హరిశంకర్, పులిసేరి ఉపేందర్, సుతారి గోపి, మార్టిన్ లూథర్, ఓం ప్రకాష్ కొలారియా, వెంకటేష్, పుప్పాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి: ప్రధాని మోదీ పాలనను ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుబాసి వాసుదేవ్ అన్నారు. హసన్‌పర్తిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్, నాయకులు తాళ్ల రమేష్, కుమార నాంపెల్లి శ్రీనివాస్, రమేష్,, రజిత, శారద పాల్గొన్నారు.

వరంగల్ చౌరస్తా: ఈనెల 8న నిర్వహించనున్న మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు కోరారు. వరంగల్ చౌరస్తాలోని ఓ హోటల్ గురువారం రాత్రి జరిగిన బీజేపీ ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రదీప్‌రావు, నాయకులు సతీష్ బాబు, రత్నం సతీష్ షా, గంట రవికుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

దేవస్థాన పాలక మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్, సభ్యులు

వరంగల్ చౌరస్తా: వరంగల్‌లో గోవిందాద్రి కొండపై గోవిందరాజ స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యులు గురువారం రాత్రి ప్రమాణ స్వీకారం చేశారు. దేవస్థానం పాలక మండలి చైర్మన్‌గా సోమరాతి సత్యనారాయణ, సభ్యులుగా చకిలం ఉపేందర్, బిర్జా గోపాల్ లహోటి, చింతాకుల రాజకృష్ణ, పట్టాభి రాజరాజేశ్వరి, ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాసస్వామి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, ఈఓ రత్నాకర్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధే ధ్యేయం



శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రమేష్

కాజీపేట అర్బన్: వర్ధన్నపేట నియోజకవర్గంలోని విలీన గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. గ్రేటర్ వరంగల్ 45వ డివిజన్ పరిధిలోని కడిపికొండ, తరాలపల్లి, రాంపేట గ్రామాల్లో రూ.1.55 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, మండల రైతుబంధు కోఆర్డినేటర్ కంకణాల సంపత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బస్కే శ్రీలేఖకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి

హసన్‌పర్తి: రెడ్డి కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే రమేష్‌ను ఇటీవల ఎన్నికైన హసన్‌పర్తి మండల రెడ్డి ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డి ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు వీసం సురేందర్‌రెడ్డి, ఇన్‌చార్జ్ కిషన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, నాయకులు పాడి గణపతిరెడ్డి, మల్లారెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

కాశిబుగ్గ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన వరంగల్ – చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య జాన్‌పీరీలు రైల్వే గేటు సమీపంలో గురువారం జరిగింది. సుమారు 30 – 35 ఏళ్ల మధ్య వయస్సు గల మృతుడి వివరాలకు రైల్వే స్టేషన్, జీఆర్పీ స్టేషన్, 97017 47014, 87126 58585 నంబర్లలో సంప్రదించాలని రైల్వే హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ సూచించారు.